ANN తెలుగు

Follow: @ANNTELUGU
REGISTERED NUMBER: APTEL/2014/58382
24-07-2025

# మహా పత్రిక

తిరుపతి, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 230 పేజీలు-04 వెల-రూ.6

PUBLISHED FROM TIRUPATI | HYDERABAD గురువారం WWW.EPAPER.MAHAADAILY.COM



## వీరమల్లు జాతర

### తెలుగు రాష్ట్రాల్లో పవన్ ఫ్యాన్స్ హంగామా

**రికార్డులు తిరగరాసిన పవన్ కల్యాణ్**

**శుభాకాంక్షలు తెలిసిన సీఎం చంద్రబాబు**

**మహా నెట్ వర్క్:** పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా విడుదల నేపథ్యంలో పవన్ అభిమానులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లలో సందడి చేస్తున్నారు. సినిమా విడుదల ఉత్సాహాన్ని చాటుతూ పలు జిల్లాల్లో భారీ బైక్ ర్యాలీలు నిర్వహించారు. అడ్వాన్స్ షోస్ తో పవన్ కల్యాణ్ రికార్డులు తిరగరాయగా, బుకింగ్స్ ఓపెన్ అయిన కొద్ది సేపటికే సోల్డ్ అవుట్ అనే సందేశాలు కనిపిస్తున్నాయి. దాదాపు రెండేళ్ల తర్వాత పవన్ నుంచి వస్తున్న సినిమా కావడంతో అభిమానుల్లో విపరీతమైన ఆసక్తి నెలకొంది. 3వేల షోస్ తో పవన్ సునామీ.. బాక్సాఫీస్ ను షేక్ చేసింది.

మిగతా 2లో

**టాప్ న్యూస్**

### బీసీ బిల్లు కోసం పార్లమెంట్ స్తంభింపజేస్తాం

- బీజేపీ, బీఆర్ఎస్ బీసీలకు వ్యతిరేకం
- 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదా?
- సాధ్యం కానప్పుడు అసెంబ్లీలో బీజేపీ ఎలా అంగీకరించింది?
- బీఆర్ఎస్, బీజేపీలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్


02



### రాజాభాయ్ మావాడే

- సస్పెండ్ చేయలేదు, ఆయనే రాజీనామా చేశారు
- ఈటల వ్యాఖ్యలపై అధిష్టానం జోక్యం చేసుకోవాలి
- హైకమాండ్ నోడల్ ఎంక్వైరీ వేసుకోవాలి
- నిజామాబాద్ ఎంపీ ధర్మపురి హాట్ కామెంట్స్


02



### యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ 25 సార్లు చెప్పారు

- దేశభక్తులు ఎందుకు తప్పించుకు తిరుగుతున్నారు
- మోదీకి రాహుల్ గాంధీ ప్రశ్న

02



SRI GOLD
TRUSTED GOLD BUYERS

**బంగారం ధరలు**

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,02,330 |
| 22 క్యారెట్ | 93,800 |
| సిల్వర్ (కేజీ) | 1,19,000 |

# కేంద్రం మెడలు వంచుతాం


## బీసీ బిల్లు ఆమోదానికి ఒత్తిడి తెస్తాం

- తెలంగాణ అసెంబ్లీలో మద్దతిచ్చి ఢిల్లీలో అడ్డుకుంటారా?
- భావోద్వేగ రాజకీయాలు చేయాలని బీజేపీ కుట్ర
- బీజేపీ రాష్ట్రాలకు ఒక న్యాయం, తెలంగాణకు ఒక న్యాయం ఉంటుందా?
- ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలని డిమాండ్

02

"తెలంగాణలో సెప్టెంబర్‌లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందని, కేంద్రం త్వరగా రిజర్వేషన్ల బిల్లును ఆమోదిస్తే వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. బీసీల రిజర్వేషన్ల బిల్లుపై సీఎం రేవంత్ రెడ్డి బుధవారం ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. బిల్లు ఆమోదం విషయంలో బీజేపీ నాయకత్వం ద్వంద్వవైఖరి అవలంభిస్తోందని, 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో మద్దతు ఇచ్చి ఇప్పుడు మరోమాట మాట్లాడుతున్నారని విమర్శించారు. ముస్లింల శాతాన్ని తీసివేయాలని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అంటున్నారని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక న్యాయం, తెలంగాణకు ఒక న్యాయం ఉంటుందా? అని ప్రశ్నించారు. యూపీ, గుజరాత్, మహారాష్ట్రలో ముస్లిం రిజర్వేషన్లను బీజేపీ ఎందుకు తొలగించటం లేదని ఆయన ప్రశ్నించారు. కొన్ని దశాబ్దాల క్రితం నుంచి గుజరాత్‌లో ముస్లిం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయని గతంలో మోదీ చెప్పారని గుర్తు చేశారు.

- మహా, ఢిల్లీ





### ఐదు గ్రామాల్లో రీసర్వే సక్సెస్

- నక్షాలు లేని 413 గ్రామాల సమస్యకు పరిష్కారం
- సమీక్షించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

వివరాలు 3లో

**స్టాక్ మార్కెట్**

| | |
|---|---|
| సెన్సెక్స్ | 82,186.81 |
| నిఫ్టీ | 25,090.60 |

**ఈరోజు చికెన్ ధరలు**

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 180 | 220 | 230 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 160 | 200 | 210 |

**ఈరోజు గుడ్డు ధరలు**

ఎన్ఈసీసీ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.8 | 144 |

హోల్ సేల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 4.8 | 144 |

రిటైల్ గుడ్డు ధర

| 1 పీస్ | ట్రే |
|---|---|
| 5.09 | 152.64 |

## మహాలక్ష్మితో ఆర్టీసీ లాభాల బాట

### ఫ్రీ బస్సుతో మహిళలు రూ.6680 కోట్లు ఆదా చేసుకున్నారు

- సంస్థలో పెండింగ్ బకాయిలు చెల్లిస్తున్నాం: భట్టి విక్రమార్క
- గత పాలకులు ఆర్టీసీని విధ్వంసం చేశారు: మంత్రి పొన్నం
- ఎంజీబీఎస్ బస్టాండ్‌లో మహాలక్ష్మి సంబరాలు

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్రంలోని మహిళలు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి రూ. 6,680 కోట్లు ఆదా చేసుకున్నారని పేర్కొన్నారు. 200 కోట్ల మహిళల ఉచిత ప్రయాణాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ ఆధ్వర్యంలో పండుగ కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని డిప్యూటీ సీఎం చెప్పారు.

మిగతా 2లో



### రేపు రాష్ట్ర కేబినెట్ భేటీ

- సీఎం రేవంత్ అధ్యక్షతన సమావేశం
- మహాలక్ష్మి పథకం, బీసీ రిజర్వేషన్‌పై చర్చలు!

02

### 28న వస్తా...

- సిట్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్ట్
- సీబీఐ విచారణకు పట్టుపడుతున్న బీజేపీ
- తనను వేధిస్తున్నారంటూ సుప్రీంకు ప్రభాకర్ రావు

02



### సూసైడ్ చేసుకుని చావడం మేలు

- ఫోన్ ట్యాపింగ్ పై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- నా ఫోన్ ట్యాప్ అయినట్లు నోటీసులు రాలే

02

## స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం

- లోకల్ బాడీ ఎన్నికలు బీఆర్ఎస్‌కు ప్రీ ఫైనల్స్
- కాంగ్రెస్‌కు కర్రు కాల్చి వాత పెట్టకుంటే నష్టపోతాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు

**వికారాబాద్, మహా:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమని ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు బీఆర్ఎస్ పార్టీకి మలుపుగా ఆయన చెప్పారు. లోకల్ బాడీ ఎన్నికలు బీఆర్ఎస్‌కు ప్రీ ఫైనల్స్ లాంటివి అని కీలక వ్యాఖ్యలు చేశారు.

మిగతా 2లో







# కేంద్రం మెడలు వంచుతాం

## బీసీ బిల్లు ఆమోదానికి ఒత్తిడి తెస్తాం

### తెలంగాణ అసెంబ్లీలో మద్దతిచ్చి ఢిల్లీలో అడ్డుకుంటారా?
### భావోద్వేగ రాజకీయాలు చేయాలని బీజేపీ కుట్ర
### బీజేపీ రాష్ట్రాలకు ఒక న్యాయం, తెలంగాణకు ఒక న్యాయం ఉంటుందా?
### ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
### దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలని డిమాండ్

**ఢిల్లీ, మహా :** తెలంగాణలో సెప్టెంబర్‌లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించిందని, కేంద్రం త్వరగా రిజర్వేషన్ల బిల్లును ఆమోదిస్తే వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. బీసీల రిజర్వేషన్ల బిల్లుపై సీఎం రేవంత్ రెడ్డి బుధవారం ఢిల్లీలో మీడియా సమావేశం నిర్వహించారు. బిల్లు ఆమోదం విషయంలో బీజేపీ నాయకత్వం ద్వంద్వవైఖరి అవలంభిస్తోందని, 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో మద్దతు ఇచ్చి ఇప్పుడు మరోమాట మాట్లాడుతున్నారని విమర్శించారు. ముస్లింల శాతాన్ని తీసివేయాలని కిషన్‌రెడ్డి, బండి సంజయ్ అంటున్నారని తెలిపారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఒక న్యాయం, తెలంగాణకు ఒక న్యాయం ఉంటుందా? అని ప్రశ్నించారు. యూపీ, గుజరాత్, మహారాష్ట్రలో ముస్లిం రిజర్వేషన్లను బీజేపీ ఎందుకు తొలగించటం లేదని ఆయన ప్రశ్నించారు. కొన్ని దశాబ్దాల క్రితం నుంచి గుజరాత్‌లో ముస్లిం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయని గతంలో మోదీ చెప్పారని గుర్తు చేశారు. ఒక వర్గం పేరు చెప్పి తెలంగాణలో బీసీలకు అన్యాయం చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు.

**బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని కుట్ర**

రాష్ట్రంలో అన్ని కులాల వారి సామాజిక, ఆర్థిక, రాజకీయ స్థితిగతులపై సర్వే చేశామని, సర్వే ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు రూపొందించామని సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అసెంబ్లీ ఆమోదించిన బిల్లును రాష్ట్రపతి ఆమోదం కోసం పంపించామని, బిల్లుల ఆమోదం కోసం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని నిర్ణయించామని తెలిపారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు ఢిల్లీలోని అగ్రనాయకత్వాన్ని కలిసి విజ్ఞప్తి చేశామని, ఇండియా కూటమిలోని నేతలను కూడా కలిసి మద్దతు కూడగట్టేందుకు ప్రయత్నిస్తున్నామని అన్నారు. తెలంగాణలో జరిగిన కులగణన విధానాన్ని లోక్‌సభ, రాజ్యసభ సభ్యులకు వివరిస్తామని చెప్పారు. కేంద్రం వచ్చే ఏడాది జనగణన, కులగణన చేపట్టనుందని, కేంద్రం చేపట్టే కులగణనకు తెలంగాణ చేసిన కులగణన సర్వే నమూనాగా నిలువనుందని తెలిపారు. సర్వేలో వ్యక్తుల వ్యక్తిగత వివరాలను వెల్లడించలేదని, 3.99 శాతం మంది తమకు ఏ కులం లేదని సర్వేలో చెప్పారని, స్వతంత్ర నిపుణుల అధ్యయన కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారమే తాము ముందుకెళ్తున్నామని అన్నారు. బీసీ రిజర్వేషన్లు అడ్డుకోవాలని కుట్ర చేస్తున్న వాళ్లే సందేహాలు లేవనెత్తుతున్నారని, కులగణన సర్వే డేటా కావాలంటే ఆయా పార్టీల ముందు, అసెంబ్లీలో ప్రవేశపెడతామని అన్నారు. తెలంగాణలో మత ప్రాతిపాదికన ఎలాంటి రిజర్వేషన్లు ఇవ్వటం లేదన్నారు. కేవలం సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబాటు ఆధారంగా 42 శాతం రిజర్వేషన్లు తెచ్చామని, యూపీలో 5 ముస్లిం కులాలు రిజర్వేషన్ల ఫలాలు పొందుతున్నాయని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

**భావోద్వేగ రాజకీయాలు**

మూడు రైతు వ్యతిరేక చట్టాల విషయంలో ఏం జరిగిందో అందరూ చూశారని, రైతుచట్టాల రద్దు స్ఫూర్తిగా బీసీ రిజర్వేషన్ల చట్టం ఆమోదం కోసం పోరాడతామని సీఎం అన్నారు. దేశవ్యాప్త కులగణన చేసేందుకు కూడా కేంద్రం మొదట ఒప్పుకోలేదని, కాంగ్రెస్ తెచ్చిన ఒత్తిడితో జనగణనతో పాటు కులగణన చేసేందుకు ఒప్పుకున్నారని గుర్తు చేశారు. బీసీల వెనుకబాటుతనం గురించి మండల్ కమిషన్ కూడా దశాబ్దాల క్రితమే నివేదిక ఇచ్చిందని, జనగణనతో పాటు కులగణన చేసేందుకు కేంద్రం ఇప్పటికీ చిత్తశుద్ధితో లేదని, తెలంగాణలో ఫిబ్రవరి 4న సామాజిక న్యాయదినోత్సవంగా పాటించామని తెలిపారు. ముస్లింల పేరుతో మరోసారి భావోద్వేగ రాజకీయాలు చేయాలని బీజేపీ చూస్తోందని ఆరోపించారు. తాము కల్పించే రిజర్వేషన్లలో మతం ప్రస్తావనే లేదని, కేవలం సామాజిక వెనుకబాటు ఆధారంగానే రిజర్వేషన్లు కల్పిస్తున్నామని, బీసీలకు అన్యాయం చేసేలా గతంలో కేసీఆర్ పంచాయతీరాజ్ చట్టానికి సవరణలు చేశారని గుర్తు చేశారు. బీసీల్లో ఉపకులాల వర్గీకరణ రిజర్వేషన్ల జోలికి ఇప్పటి వరకు వెళ్లలేదని, రిజర్వేషన్లు 50 శాతం దాటవద్దన్న నిబంధనను బీజేపీ ఎప్పుడో తుంగలో తొక్కిందని విమర్శించారు. 10 శాతం ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో 50 శాతం నిబంధన ఎప్పుడో దాటిపోయిందని, ఈడబ్ల్యూఎస్‌ల విషయంలో అడ్డురాని నిబంధన బీసీల విషయంలో ఎందుకు వస్తోందని ప్రశ్నించారు.

**దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలి**

ఓబీసీలకు న్యాయం చేయాలని బీజేపీని కోరుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బీసీ అయిన దత్తాత్రేయను ఉపరాష్ట్రపతిని చేయాలని కోరారు. ఓబీసీలను బీజేపీ చిన్నచూపు చూస్తోందని, ఇప్పటికే దత్తాత్రేయను గవర్నర్ పదవి నుంచి తొలగించారని తెలిపారు. కేంద్ర పదవుల్లో తెలంగాణకు, బీసీలకు అన్యాయం జరుగుతోందని విమర్శించారు. గతంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న బీసీ నేతను తొలగించారని, తెలంగాణ బీజేపీ అధ్యక్ష పదవి మరోసారి ఓసీ నేతకే ఇచ్చారని, గతంలోనూ దత్తాత్రేయను తొలగించి కిషన్‌రెడ్డికి పదవి ఇచ్చారని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్, హర్కర వేణుగోపాల రావు, ఎంపీలు అనిల్ కుమార్, మల్లు రవి, సురేశ్ షెట్కార్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కుందూరు రఘువీర్ రెడ్డి, గడ్డం వంశీ కృష్ణ, కడియం కావ్య పాల్గొన్నారు.

## బీసీ బిల్లు కోసం పార్లమెంట్ స్తంభింపజేస్తాం

- బీజేపీ, బీఆర్ఎస్ బీసీలకు వ్యతిరేకం
- 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఇష్టం లేదా?
- సాధ్యం కానప్పుడు అసెంబ్లీలో బీజేపీ ఎలా అంగీకరించింది?
- బీఆర్ఎస్, బీజేపీలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఫైర్

**హైదరాబాద్, మహా:** బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలపై టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ, బీర్ఎస్ పార్టీలు బీసీలకు వ్యతిరేకమని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్స్ తీసుకొచ్చేందుకు చేస్తోన్న ప్రయత్నాలకు బీఆర్ఎస్ మోకాలడ్డుతోందని విమర్శించారు. బుధవారం మీడియాతో ఆయన మాట్లాడారు. తాము పంపిన బీసీ రిజర్వేషన్ల బిల్లును రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చేందుకు బీజేపీ ససేమిరా అంటోందని.. 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడం ఆ పార్టీకి ఇష్టం లేనట్లుగా ఉందన్నారు. బీసీ రిజర్వేషన్ల బిల్లును 9వ షెడ్యూల్‌లో చేర్చడం ఎందుకు సాధ్యం కాదు? అలాంటప్పుడు అసెంబ్లీలో బీజేపీ ఎమ్మెల్యేలు ఎందుకు అంగీకరించారు అని ప్రశ్నలు కురిపించారు. బిల్లు ప్రతిపాదన ఢిల్లీకి చేరేసరికి ఎందుకు మాట మారుస్తున్నారు అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ జాతీయ నాయకత్వం.. తమ అభిప్రాయాన్ని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి నోటితో పలికిస్తూ పలాయనం చిత్తగిస్తోందన్నారు. బీసీ బిల్లు కోసం పార్లమెంట్‌ను స్తంభింపజేస్తామని, ఈ నెల 25న జరగనున్న ఓబీసీల సదస్సులో రాహుల్ గాంధీ బీసీ గొంతుకై నిలవబోతున్నారని ఈ సందర్భంగా స్పష్టం చేశారు. బీసీ వ్యతిరేక పార్టీలైన బీఆర్ఎస్, బీజేపీ నుంచి బీసీలంతా బయటకు రావాలని అంటూ మహేశ్ కుమార్ గౌడ్ పిలుపునిచ్చారు.

# రాజాభాయ్ మావాడే..

## సస్పెండ్ చేయలేదు.. ఆయనే రాజీనామా చేశారు

### ఈటల వ్యాఖ్యలపై అధిష్టానం జోక్యం చేసుకోవాలి
### హైకమాండ్ నోడల్ ఎంక్వైరీ వేసుకోవాలి
### నిజామాబాద్ ఎంపీ ధర్మపురి హాట్ కామెంట్స్

**ఢిల్లీ, మహా :** కేంద్రమంత్రి బండి సంజయ్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ వివాదంపై నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. పార్టీ అన్నాక నేతలుంటారు, నేతల మధ్య కొన్ని కొన్ని మనస్పర్ధలుంటాయి, అన్ని పార్టీలలో ఇలాంటి సందర్భాలున్నాయన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల్లో నేతల మధ్య ఉన్న వైరాన్ని ఈ సందర్భంగా అరవింద్ గుర్తు చేశారు. కాంగ్రెస్‌లో రాజగోపాల్ రెడ్డి ఏం చేస్తున్నాడు.. ఆ పార్టీ హై కమాండ్ ఏం చేస్తోంది. అలాగే కొండా మురళి, కొండా సురేఖలు ఏం చేస్తున్నారు. బీఆర్ఎస్‌లో కవిత, కేటీఆర్ ఏం చేస్తున్నారు. పార్టీ అన్నాక కొన్ని వివాదాలు నడుస్తూ ఉంటాయి. బీజేపీ పాత అధ్యక్షుడు, కొత్త అధ్యక్షుడు కలిసి ఈటల రాజేందర్, బండి సంజయ్‌ల విషయంలో కూర్చోని మాట్లాడాలని అరవింద్ సూచించారు. అవసరమైతే బీజేపీ అధిష్టానం పెద్దలు మాట్లాడాలన్నారు. ఈటల, బండి సంజయ్‌ల విషయంలో బీజేపీ కేంద్ర హై కమాండ్ నోడల్ ఎంక్వైరీ కమిషన్ వేసుకోవాలని సూచించారు. ఏవో కొన్ని విషయాలను పట్టుకుని మీడియా అతిగా చూపించడం సరైంది కాదన్నారు. రాజాసింగ్ ఎక్కడున్నా తాము గౌరవిస్తామని, ఆయన ఐడియాలాజికల్ మ్యాప్ అని అభివర్ణించారు. ఆయన సస్పెండ్ కాలేదని, రిజైన్ చేశారని గుర్తు చేశారు. రాజాసింగ్ రేపు పార్టీ సభ్యత్వం కోసం మిస్డ్ కాల్ ఇచ్చి మెంబర్‌షిప్ తీసుకోవచ్చని సూచించారు.



కొన్ని విషయాల్లో మనస్థాపం చెంది రాజాసింగ్ రాజీనామా చేశారని చెప్పుకొచ్చారు. తెలంగాణ బీజేపీ ఎంపీలకు ఒక్కొక్కరికి రెండు నియోజకవర్గాల బాధ్యతలు ఇవ్వాలని అరవింద్ కోరారు. ఎంపీలు పని చేసేందుకు అవకాశం ఇవ్వాలని, ఫలితం చూపించకపోతే పక్కకు పెట్టాలన్నారు. ఏ పార్టీకైనా కార్యకర్తలు కీలకమని తెలిపారు. కార్యకర్తలు, నాయకులు అయ్యే సమయం ఇదేనని పేర్కొన్నారు. ఇందూరు జిల్లాలో జిల్లా పరిషత్ చైర్మన్ పదవిని తాము గెలుస్తున్నామని జోస్యం చెప్పారు. తెలంగాణలో వచ్చేవి కార్యకర్తల కోసం జరిగే ఎన్నికలని.. బీజేపీ శ్రేణులు ఈ విషయాన్ని ప్రాధాన్యతగా తీసుకోవాలని సూచించారు. తమ కార్యకర్తలను నాయకులుగా చేయాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని ఎంపీ ధర్మపురి అరవింద్ పిలుపు నిచ్చారు.

## యుద్ధాన్ని తానే ఆపానని ట్రంప్ 25 సార్లు చెప్పారు

### దేశభక్తులు ఎందుకు తప్పించుకు తిరుగుతున్నారు
### మోదీకి రాహుల్ గాంధీ ప్రశ్న

**మహా:** భారత్‌పాక్ మధ్య కాల్పుల విరమణకు తానే ఒప్పించానని ట్రంప్ ఇప్పటివరకూ 25 సార్లు చెప్పారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. దీనిపై కేంద్రం వివరణ ఇవ్వాలని పార్లమెంటు ప్రాంగణంలో బుధవారం నాడు మీడియాతో మాట్లాడుతూ అన్నారు. దేశ భక్తులమని చెప్పుకుంటున్న వారు సమాధానం చెప్పకుండా తప్పించుకుని తిరుగుతున్నారని, ప్రధాని దీనిపై కనీసం ఒక్క ప్రకటనా చేయలేదని అన్నారు. 'ఇది తన పనేనని ప్రకటన చేయడానికి ట్రంప్ ఎవరు? ఇది ఆయన పని కాదు. ప్రధాని ఇంతవరకూ స్పందించకపోవడం వాస్తవం' అని పేర్కొన్నారు.

## రేపు రాష్ట్ర కేబినెట్ భేటీ

- సీఎం రేవంత్ అధ్యక్షతన సమావేశం
- మహాలక్ష్మి పథకం, బీసీ రిజర్వేషన్‌పై చర్చలు!

**హైదరాబాద్, మహా:** రాష్ట్రంలో మహిళలకు ఆర్థిక భరోసా అందించే లక్ష్యంతో ప్రభుత్వం కొత్త స్కీమ్‌పై దృష్టి పెట్టినట్లు టాక్ నడుస్తోంది. ఈ నెల 25న సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో జరుగనున్న కేబినెట్ భేటీలో మహాలక్ష్మి పథకంలో భాగంగా 18 ఏళ్లు దాటిన యువతులు, మహిళలకు నెలకు రూ.2,500 అందించే ప్రతిపాదనకు ఆమోదం లభించే అవకాశం ఉందని తెలుస్తోంది. అన్ని శాఖల నుంచి అవసరమైన నివేదికలను సమీకరించేందుకు సీఎస్ కే.రామకృష్ణారావు ఇప్పటికే అధికారులను ఆదేశించారు. అదే సమయంలో, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించే ఆర్డినెన్స్ గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న నేపథ్యంలో ఈ అంశంపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం పొందడం, దాని చట్టపరమైన సవాళ్లను ఎదుర్కోవడంపై కేబినెట్ సభ్యులు చర్చించనున్నారు. తెలంగాణ హైకోర్టు సెప్టెంబర్ 30 నాటికి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించినందున, ఈ ఆర్డినెన్స్‌పై త్వరితగతిన నిర్ణయం తీసుకోవాల్సిన ఒత్తిడి ప్రభుత్వంపై ఉంది. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగే ఈ సమావేశం జరగనున్నది. గత కేబినెట్ నిర్ణయాల అమలు స్థితిగతులను సమీక్షించడంతో పాటు, రాష్ట్రంలో ఉద్యోగ నియామకాలు, విద్యా సంస్థల అప్‌గ్రేడేషన్ వంటి ఇతర కీలక అంశాలపై కూడా చర్చ జరిగే అవకాశం ఉంది.

## సూసైడ్ చేసుకుని చావడం మేలు

- ఫోన్ ట్యాపింగ్ పై సీఎం రేవంత్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- నా ఫోన్ ట్యాప్ అయినట్లు నోటీసులు రాలే

**మహా:** ఫోన్ ట్యాపింగ్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఫోన్ ట్యాపింగ్ ద్వారా ఫ్యామిలీ మెంబర్స్ విషయాలు విన్నారని అంటున్నారు.. అలా వినాల్సిన అవసరం ఏంటి..? ఆ పరిస్థితే వస్తే సూసైడ్ చేసుకుని చావడం మేలు అని హాట్ కామెంట్స్ చేశారు. ఢిల్లీలో మీడియా సమావేశం అనంతరం ఆయన చిట్‌చాట్ చేశారు. ఫోన్ ట్యాపింగ్‌పై ప్రభుత్వం కేసు పెట్టలేదని, సామగ్రి మిస్సింగ్ కేసును లోతుగా విచారణ చేస్తే ఇవన్నీ బయటపట్టాయన్నారు. ఫోన్ ట్యాపింగ్ విచారణను తాను డిక్టేట్ చేయనని, నిజానికి ఫోన్ ట్యాపింగ్‌పై తొలుత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ తొలుత ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ చట్టవిరుద్ధం కాదని, దానికంటూ ఓ పద్ధతి ఉంటుందన్నారు. నా ఫోన్ ట్యాప్ అయిందని అనుకోవడం లేదని.. దానిపై ఇంతవరకు నోటీసులు రాలేదన్నారు. ఒకవేళ నోటీసులు వస్తే విచారణకు వెళ్తానని స్పష్టం చేశారు.

## 28న వస్తా

- సిట్‌కు కేంద్ర మంత్రి బండి సంజయ్ లేఖ
- ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్ట్
- సీబీఐ విచారణకు పట్టుపడుతున్న బీజేపీ
- తనను వేధిస్తున్నారంటూ సుప్రీంకు ప్రభాకర్ రావు

**హైదరాబాద్, మహా:** ఫోన్ ట్యాపింగ్ కేసు వ్యవహారంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ సిట్‌కు లేఖ రాశారు. తెలంగాణలో రాజకీయ ప్రకంపనలు రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో పలువురికి నోటీసులు ఇచ్చి సిట్ అధికారులు వాంగ్మూలం తీసుకున్నారు. కేంద్రమంత్రి బండి సంజయ్‌కు సిట్ నోటీసులు ఇవ్వగా తొలుత 24వ తేదీన హాజరుకావాలని భావించారు. పార్లమెంట్ సమావేశాలు ఉన్న సమయంలో సిట్ విచారణకు రాలేనని బండి సంజయ్ తెలిపారు. తాను 28న విచారణకు హాజరవుతానని సిట్ అధికారులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ తెలియజేశారు. ఈ నెల 28న వాంగ్మూలం ఇచ్చేందుకు సిద్ధమని తెలిపారు. అదే రోజున సంజయ్‌తోపాటు ఆయన వ్యక్తిగత సిబ్బంది విచారణకు హాజరు కానున్నారు. జాతీయ స్థాయి అంశంగా ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మారగా, సీబీఐ విచారణకు బీజేపీ డిమాండ్ చేస్తోంది. అయితే ఇప్పటిదాకా కేంద్రసంస్థలు ఉ దర్యాప్తుచేస్తున్న కేసులు ఎందుకు ముందుకు కదలడం లేదని రాష్ట్ర ప్రభుత్వం ప్రశ్నిస్తోంది.

**సుప్రీంకు ప్రభాకర్ రావు**

రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ట్విస్టుల మీద ట్విస్టులు చోటు చేసుకుంటున్నాయి. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ప్రభాకర్ రావు మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. విచారణ పేరుతో సిట్ అధికారులు వేధిస్తున్నారంటూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తరచూ పోలీస్ స్టేషన్‌కు పిలిచి ఇబ్బంది పెడుతున్నారంటూ పిటిషన్ లో పేర్కొన్నారు. ప్రభాకర్ రావు పిటిషన్‌పై ఆగస్టు 4న విచారణ జరగనుంది.

# మహాలక్ష్మితో ఆర్టీసీ లాభాల బాట




(మొదటిపేజీ తరువాయి)

రాష్ట్రంలోని మహిళలు పిల్లల చదువుల కోసం, దేవాలయాల సందర్శన, నగరాల్లో ఉద్యోగం వంటి పనుల కోసం ఆర్టీసీ సేవలను మహాలక్ష్మి పథకం ద్వారా ఉపయోగించుకొని ఆర్థికంగా ప్రయోజనం పొందాలని తెలిపారు. ఆర్టీసీ మునిగిపోయే పడవ అని ఆరోజు అన్నారు, ఉచిత బస్సు ప్రయాణం ప్రవేశపెట్టిన తర్వాత ఇప్పుడు ఆర్టీసీ లాభాల్లోకి వచ్చి నిలదొక్కుకుందని వివరించారు. 200 కోట్ల ప్రయాణాలకు అయిన ఖర్చు రూ. 6,680 కోట్లు ఆడబిడ్డల పక్షాన ఆర్టీసీకి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు చెల్లిస్తుందని తెలిపారు. భవిష్యత్తులోనూ ఆడబిడ్డల ఆర్టీసీ చార్జీలమే ఆర్టీసీకి చెల్లిస్తుందని అన్నారు.

**కొత్త కొత్త విధానాలు తీసుకురావడం..**

ఆర్టీసీలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో కొత్త కొత్త విధానాలు తీసుకురావడం మూలంగా ఆదాయం పెరిగి ఇప్పటివరకు ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 2,400 కొత్త బస్సులు కొనుగోలు చేసిందని డిప్యూటీ సీఎం అన్నారు. ఒకప్పుడు ఆర్టీసీ ఆక్యుపెన్సీ రేషియో 60 శాతం ఉను రాష్ట్రప్రభుత్వటే, మహాలక్ష్మి పథకం ద్వారా అది 97 శాతానికి పెరిగిందని తెలిపారు. మహాలక్ష్మి పథకానికి ముందు ఆర్టీసీలో 45 లక్షల మంది ప్రయాణం చేస్తే, ఇప్పుడు వారి సంఖ్య 65 లక్షలకు చేరుకుందని వివరించారు. హైదరాబాద్‌లో కాలుష్యం పెరుగుతున్నందున, నగరాన్ని కాలుష్యరహిత నగరంగా తీర్చిదిద్దేందుకు నగరంలో ఉన్న డీజిల్ బస్సులను హైదరాబాద్ నగరం బయటికి దశలవారీగా షిఫ్ట్ చేస్తున్నామన్నారు. నగరంలో ఉన్న బస్సుల్లో 11 శాతం బ్యాటరీ బస్సులను జత చేశారని, ఇప్పటికే మూడు వేల బ్యాటరీ బస్సులకు ఆర్డర్ ఇచ్చారని, మరో 500 బస్సులను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారని డిప్యూటీ సీఎం తెలిపారు.

**సంస్థలో పెండింగ్ బకాయిలు చెల్లిస్తున్నాం..**

ఆర్టీసీలో కొత్తగా నియామకాలు జరుగుతున్నాయని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లకు శుభాకాంక్షలు తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించామన్నారు. ఆర్టీసీ నష్టాల నుంచి లాభాల్లోకి వచ్చిందని పేర్కొన్నారు. సంస్థలో పెండింగ్ బకాయిలు చెల్లిస్తున్నట్లు తెలిపారు. మహిళా సంఘాలతో బస్సులు కొనుగోలు చేయిస్తున్నామన్నారు. గత పాలకులు పదేళ్లు ఆర్టీసీని విధ్వంసం చేశారని విమర్శించారు. కార్యక్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం



(మొదటిపేజీ తరువాయి)

వికారాబాద్‌లోని అన్ని స్థానాల్లో గులాబీ జెండా ఎగరాలన్నారు. వికారాబాద్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్, బీజేపీ నేతలు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరగా.. పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'స్థానిక సంస్థల ఎన్నికల్లో బంపర్ మెజార్టీతో బీఆర్ఎస్ గెలిచిన తర్వాత కాంగ్రెస్ కార్యకర్తల్లాగా పనిచేస్తున్న అధికారులంతా సెట్ రైట్ అవుతారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు స్థానిక సంస్థల ఎన్నికలు ప్రీ ఫైనల్ లాంటివన్న కేటీఆర్, టికెట్ ఎవరికి ఇచ్చినా వారిని గెలిపించుకోవాలి. ఇంటింటికి తిరిగి కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించి చెప్పాలి. పాలిచ్చే బర్రెను పక్కనపెట్టి ఎగిరితన్నే దున్నపోతును తెచ్చుకున్నట్టు అయిందని తెలంగాణ ప్రజలు బాధపడుతున్నారు. ఆరు గ్యారంటీల పేరుతో అడ్డగోలు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ, ఇవాళ తెలంగాణ ప్రజలను దారుణంగా మోసం చేసింది. మీసేవ కార్యాలయాల్లో ఇచ్చే రేషన్ కార్డులను జారీ చేసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్ద పెద్ద సభల్లో గప్పాలు కొట్టుకుంటున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీలు, జడ్పీటీసీ లాగా గెలవండి.. మిమ్మల్ని ఏ అధికారి వేధించడు. కాంగ్రెస్ పట్ల ప్రజల్లో ఉన్న అంతులేని వ్యతిరేకతను అందిపుచ్చుకోవాలి. అభ్యర్థితో సంబంధం లేకుండా కారు గుర్తుకు ఓటు వేసే లాగా ప్రజలను చైతన్యపరిస్తే స్థానిక సంస్థల ఎన్నికల్లో వికారాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాలు, జిల్లా పరిషత్ స్థానం బీఆర్ఎస్‌దే అవుతుంది. నాట్లు వేసేటప్పుడు ఇవ్వకుండా ఓట్లు వేసే టైంకు రేవంత్ రెడ్డి రైతుబంధు వేస్తున్నాడు. అధికారంలోకి వచ్చిన 20 నెలల్లో ఒకసారి మాత్రమే రైతుబంధు వేసి దానికి సంబరాలు చేసుకోవాలని చెప్తున్నారని' కేటీఆర్ వ్యాఖ్యానించారు.

# వీరమల్లు జాతర

## తెలుగు రాష్ట్రాల్లో పవన్ ఫ్యాన్స్ హంగామా

### రికార్డులు తిరగరాసిన పవన్ కల్యాణ్
### శుభాకాంక్షలు తెలిపిన సీఎం చంద్రబాబు



(మొదటిపేజీ తరువాయి)

మీకు నచ్చితే రికార్డులు బద్దలు కొట్టేయండి అంటూ పవన్ పిలుపునివ్వడంతో ఫ్యాన్స్ పూనకాలతో ఊగిపోతున్నారు. కేవలం అడ్వాన్స్ బుకింగ్స్ ద్వారా 30 కోట్ల రూపాయిల గ్రాస్ వసూళ్లు నమోదు కాగా, పవనే స్వయంగా రంగంలోకి దిగి ప్రచారం చేస్తుండడంతో సినిమాకు విపరీతమైన బజ్ ఏర్పడింది. మంత్రి నారా లోకేష్ తో పాటు వైసీపీ నేత అంబటి రాంబాబు కూడా సినిమాకు బెస్ట్ విషెస్ చెప్పారు. హైదరాబాద్ లో ఎక్కడ చూసినా వీరమల్లు ఫీవర్ కనిపించగా, ఆంధ్రాలోనూ ర్యాలీలతో ఫ్యాన్స్ హంగామా చేశారు. ఏపీ సీఎం చంద్రబాబు కూడా పవన్ కు శుభాకాంక్షలు చెప్పారు.

**నాకు ఇవ్వడమే తెలుసు - పవన్ కల్యాణ్**

హరిహర విరమల్లు' సినిమా వైజాగ్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆసక్తికర కామెంట్స్ చేశారు. విశాఖపట్నం నా గుండెల్లో ఉంటుందని చెప్పిన పవన్.. ఉత్తరాంధ్ర ఆట పాట అణువణువునా నేర్చుకున్నానని చెప్పారు. 'ఈ ధైర్యాన్ని.. నటన ద్వారా ఇచ్చింది.. మా గురువు సత్యానంద్ . ఆయన ద్వారానే విశాఖన్నా.. ఉత్తరాంధ్రన్నా మా అభిమానాలు ఎక్కువగా ఇష్టపడతారు. మూడేళ్ల క్రితం విశాఖలోని నోవోటల్ లో నన్ను నిర్బంధిస్తే, నాకోసం విశాఖ మొత్తం హోటల్ దగ్గరకు వచ్చింది. విశాఖ నాకు బలమైన జ్ఞాపకాలను ఇచ్చింది. గత ప్రభుత్వంలో నా సినిమాలకు టికెట్ రేట్లు పెంచడానికి అవకాశం ఇవ్వలేదు. సీఎం చంద్రబాబు అందరి హీరోలకు చేసినట్లు గానే నా సినిమాకు టికెట్ రేట్లు పెంచడానికి అవకాశం ఇచ్చారు. నా సినిమా టికెట్ రేట్లు పెంచుకొనే అవకాశం ఇచ్చిన సీఎం చంద్రబాబు గారికి కృతజ్ఞతలు. నా సినిమా హిట్ అవ్వాలని మనస్ఫూర్తిగా ట్వీట్ చేసిన యువ నాయకులు లోకేష్ కు కృతజ్ఞతలు.' అని పవన్ అన్నారు. నాకు ఇవ్వడమే తెలుసు.. అడగడం తెలియదన్న పవన్ కళ్యాణ్.. 'నేను తీసుకున్న శాఖలకు ఇబ్బంది లేకుండా సినిమాలు చేసాను. రాష్ట్రంలో నియతృత్వ పోకడలు ఉన్న ప్రభుత్వాన్ని ఎదుర్కొని నిలబడే శక్తి నాకు సినిమా ఇచ్చింది. సినిమాకు కులం, మతం ఉండదు. సనాతనధర్మం మతాలకు వ్యతిరేకం కాదు. విశాఖ వేదికగా హరిహర వీరమల్లు సినిమా విజయవంతం కావాలని కోరుకుంటున్నాను.' అని పవన్ కళ్యాణ్ అన్నారు.

# ఐదు గ్రామాల్లో రీసర్వే సక్సెస్

## నక్షాలు లేని 413 గ్రామాల సమస్యకు పరిష్కారం

### సమీక్షించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

**హైదరాబాద్, మహా :** రాష్ట్రంలో నక్షా లేని 413 గ్రామాలలో ఐదింటిని ఎంపిక చేసి ప్రయోగాత్మకంగా చేపట్టిన రీసర్వే విజయవంతమైందని, వీలైనంత త్వరితగతిన ఆ ఐదు గ్రామాల్లో సర్వే బౌండరీస్ యాక్ట్ ప్రకారం నక్షా మ్యాప్ నకు తుది రూపునిస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రీ సర్వేపై సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, రెవెన్యూ శాఖ కార్యదర్శి వి.లోకేష్ కుమార్, సర్వే ల్యాండ్ సెటిల్ మెంట్ కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతుతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. నిజాం కాలం నుంచి 413 గ్రామాలకు నక్షాలు లేవని గత ప్రభుత్వం పది సంవత్సరాల్లో ఈ గ్రామాలను గాలికి వదిలేసిందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వం దీనికి పరిష్కారం చూపాలన్న లక్ష్యంతో ప్రయోగాత్మకంగా మహబూబ్‌నగర్ జిల్లా గండీడ్ మండలం సలార్ నగర్, జగిత్యాల్ జిల్లా భీర్పూర్ మండలం కొమ్మనాపల్లి(కొత్తది), ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం మండలం ములుగుమడ, ములుగు జిల్లా వెంకటాపురం మండలం నూగురు, సంగారెడ్డి జిల్లా వట్ పల్లి మండలం షాహిద్ నగర్ గ్రామాల్లో డ్రోన్/ఏరియల్, ప్యూర్ గ్రౌండ్ ట్రూతింగ్ రోవర్ పద్ధతుల్లో సర్వే నిర్వహించినట్లు తెలిపారు. నిబంధనల ప్రకారం భూ యజమానులకు నోటీసుల జారీ చేయడం, గ్రామ సభలు నిర్వహించి యజమానుల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకొని ప్రతి ఒక్కరి భూములకు సర్వే హద్దులను ఖరారు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. ఈ ఐదు గ్రామాల్లో ఎదురైన అనుభవాలను దృష్టిలోపెట్టుకొని మిగిలిన గ్రామాల్లో కూడా రీసర్వే నిర్వహించడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రజల మనోభావాలు, ఆలోచనలకు అనుగుణంగా వారు సంతృప్తి



చెందే విధంగా నక్షా మ్యాప్ ఉండాలని అధికారులకు సూచించారు.

**రైతుల సంతోషమే ముఖ్యం**

ప్రభుత్వం ఏం చేసినా అంతిమంగా సామాన్య ప్రజలు, రైతుల సంతోషమే ప్రధానమని పొంగులేటి అన్నారు. భూముల అమ్మకం, కొనుగోలు సందర్భంలో హద్దులతో కూడిన సర్వే మ్యాప్ ను ఖచ్చితంగా జత పరచాలని, అలాగే దేశంలో ప్రతి పౌరుడికి ఆధార్ నెంబర్ ఎలా ఉంటుందో భూములకు కూడా భూదార్ నెంబర్ కేటాయించాలని భూ భారతి చట్టంలో స్పష్టం చేస్తుందన్నారు. ఈ ఐదు గ్రామాలలో ఈ రెండు అంశాలను అమలు చేయాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. ఐదు గ్రామాల్లో ఐదు గుంటలకు పైగా ఉన్న భూములకు కొత్తగా సర్వే నంబర్లు ఇవ్వాలని, రెవెన్యూ, ఫారెస్ట్, దేవాదాయ, వక్ఫ్ భూములు ఉంటే వాటి వివరాలను కూడా రికార్డులలో నమోదు చేయాలని అధికారులకు సూచించారు. సమావేశంలో సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ ప్రసన్నలక్ష్మి, ఐదు గ్రామాలకు చెందిన ఆర్డీవోలు, తహశీల్దార్లు, సర్వే ల్యాండ్ సెటిల్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్లు, సర్వే నిర్వహించిన ఏజన్సీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# వీలైనంత త్వరగా ఆర్ఎస్ ప్రవీణ్ ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేరాలి

## కేటీఆర్ లాగే ఆయన మానసిక స్థితి సరిగా లేదేమో.. ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్, మహా:** బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ ఫైర్ అయ్యారు. ఆయన రక్తం గులాబీ రంగులోకి మారిందంటూ విమర్శించారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి తల్చుకుంటే మీకు నాయకత్వమే ఉండకపోయేది. కక్ష రాజకీయాలుచేస్తే అందరూ జైలుకు వెళ్లి దిక్కులేని పక్షులు అయ్యేవారు. కేటీఆర్ భాష చూస్తే ప్రవీణ్ కుమార్‌కు రక్తం మరగడం లేదా..? అంటూ అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. కేసీఆర్ తన ఫోన్ ట్యాప్ చేస్తున్నారని ప్రవీణ్ గతంలో అనేక సార్లు చెప్పారు. ఇప్పుడు కేటీఆర్ ప్రాపగాండా టీంలో ప్రధాన సభ్యుడిగా ఆయన చేరాడు. కేటీఆర్ లాగే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మానసిక స్థితి సరిగా లేదేమో. తన ఫోన్ ట్యాప్ అయిందని కవిత కూడా చెబుతుంది. ప్రవీణ్ వెళ్లి కవితను కలిసి ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడాలి. అనవసరపు అబద్ధాలు చెప్తే క్రెడిబిలిటీ పోవడమే కాకుండా.. లీగల్‌గా కూడా అనేక సమస్యలు వస్తాయని దయాకర్ హెచ్చరించారు.

**మంత్రుల మధ్య పంచాయితీలు..**

కేసీఆర్ కుటుంబంలోనివాళ్లే వాళ్ళ దోపిడిని తట్టుకోలేక బయటకి వచ్చి నిజాలు చెప్తున్నారు. కేసీఆర్ తరువాత కేటీఆర్ అని ప్రచారం చేసుకోవటంకోసం.. కేటీఆర్ రూ.650 కోట్లు ఖర్చు చేస్తున్నారంటూ అద్దంకి దయాకర్ ఆరోపించారు. మంత్రుల ఫోన్ ట్యాపింగ్ అవుతుందని బీఆర్ఎస్ నేతలకు ఎవరు చెప్పారు. మేం ఫోన్ ట్యాపింగ్ అనగానే వాళ్లు ఫోన్ ట్యాపింగ్ అంటున్నారు. బీఆర్ఎస్ నేతలవి పిచ్చి వ్యాఖ్యలు. ఇది బీఆర్ఎస్ పార్టీ నేతలు కావాలని చేస్తున్న ప్రచారం. మంత్రుల మధ్య పంచాయితీలు పెట్టేందుకు ఈ



ఆరోపణలు చేస్తున్నారు. కవిత బయటకు వచ్చి తన ఫోన్ ట్యాపింగ్ అయిందని అన్నారు. మా మంత్రులు



ఎవరైనా బయటకి వచ్చి ఫోన్ ట్యాపింగ్ అవుతుందని చెప్పారా..? అంటూ అద్దంకి దయాకర్ అన్నారు.

# యాదాద్రీశుడి హుండీ ఆదాయం రూ.2,45 కోట్లు

## 41 రోజుల హుండీ ఆదాయం లెక్కింపు

**యాదగిరిగుట్ట, మహా:** యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కించారు. గత 41 రోజులుగా భక్తులు సమర్పించిన నగదు, నగల కానుకలను బుధవారం ఆలయ సిబ్బంది లెక్కించారు. రూ. 2,45,48,023 నగదు సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వెంకట్రావు వెల్లడించారు. దీంతో పాటు 38 గ్రాముల బంగారం, 2,800 గ్రాముల వెండి, వివిధ దేశాల కరెన్సీలు హుండీ ఆదాయం ద్వారా సమకూర్చినట్లు తెలిపారు. విదేశీ కరెన్సీ విషయానికి వస్తే అమెరికా 1036 డాలర్లు, ఆస్ట్రేలియా 5 డాలర్లు, ఇంగ్లండ్ 45 పౌండ్లు, సౌదీ అరేబియా 5 రియాల్, సింగపూర్ 10 డాలర్లు, మలేసియా 23 రింగిట్స్, కెనడా 20 డాలర్లు,



ఒమన్ 500 బైస, అరబ్ ఎమిరేట్స్ 70 ధీరమ్స్‌తో సహా 12 దేశాల కరెన్సీలు లక్ష్మీనరసింహస్వామి వారికి సమర్పించారు.

# భర్త నాలుక కొరికి మింగేసిన భార్య

## ఆస్పత్రిలో చేర్చిన తర్వాత కూడా ఘర్షణ.. ఇదెక్కడి దారుణం?

**మహా:** భార్యభర్తల మధ్య గొడవలు సహజంగానే జరుగుతుంటాయి. ఈ క్రమంలోనే కోపం ఎక్కువైతే పరిస్థితి ఊహించడానికే భయంకరంగా ఉంటుంది.. భర్తపై ఆగ్రహించిన ఓ భార్య అతడి నాలుకను కొరికేసింది. అనంతరం దానిని నమిలి మింగేసింది. ఈ విచిత్ర ఘటన బిహార్‌లోని గయాలో జరిగింది.

**చిన్న గొడవ చిలికిచిలికి**

గయాలోని ఖిజ్రాసరాయ్ పోలీస్ స్టేషన్ పరిధికి చెందిన భార్యభర్తల మధ్య ఓ విషయంలో చిన్న గొడవ తలెత్తింది. ఈ క్రమంలోనే మాటామాటా పెరిగి ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో ఆగ్రహించిన భార్య, భర్త నాలుకను కొరికేసింది. ఆపై దానిని నమిలి మింగేసింది. భర్త పరిస్థితి విషమించడంతో గ్రామస్థులు అతడిని సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మగధ్ మెడికల్ కాలేజీకి తరలించారు. అయితే, ఆస్పత్రికి తరలించిన తర్వాత కూడా భార్యభర్తలు గొడవ పడ్డారని స్థానికులు చెప్పారు. ఈ ఘటనపై పోలీసులు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

**రాజస్థాన్‌లోనూ ఇలాంటి ఘటన**

కొన్ని నెలల క్రితం రాజస్థాన్‌లోని జల్వార్ జిల్లాలో కూడా ఇలాంటి ఘటనే జరిగింది. భర్త నాలుక కొరికి తీవ్రంగా గాయపరించింది అతడి భార్య. తీవ్ర గాయాలపాలైన భర్తను ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అనంతరం తన తప్పు తెలుసుకుని బాధపడిన భార్య, రూమ్‌కు తాళం వేసుకుని లోపలే ఉండిపోయింది. ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించగా కుటుంబసభ్యులు కాపాడారు.

# 9 మంది డ్రగ్ పెడ్లర్ల అరెస్ట్

## రూ. 69లక్షల విలువైన డ్రగ్స్ సీజ్

- నిందితుల్లో పలువురు విదేశీయులు
- ఆయుధాలు కూడా స్వాధీనం చేసుకున్నాం: సీపీ సీవీ ఆనంద్

**హైదరాబాద్, మహా:** నగరంలో డ్రగ్స్ విక్రయిస్తున్న 9 మందిని హెచ్‌న్యూ పోలీసులు అరెస్టు చేశారు. కొకైన్ సరఫరా చేస్తున్న ఆరుగురు, మెఫిడ్రిన్ సరఫరా చేస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు పోలీసులు తెలిపారు. నిందితల నుంచి 286 గ్రాముల కొకైన్, 11 గ్రాముల ఎక్స్‌టసీ, తుపాకీ, 12 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఈ కేసు వివరాలను సీపీ సీవీ ఆనంద్ వెల్లడించారు. డగ్స్ కేసులో రవివర్మ, సచిన్ అనే ఇద్దరు కీలక వ్యక్తులను పట్టుకుని వారి నుంచి ముఖ్యమైన సమాచారం సేకరించామని స్పష్టం చేశారు. రవివర్మకు ముంబయికి చెందిన ముఠాతో సంబంధాలున్నాయని, అక్కడ ఉన్న వాహిద్ అనే వ్యక్తికి విదేశాల నుంచి కొకైన్ వస్తోందని, అతడి నుంచి నిందితులు హైదరాబాద్‌కు డ్రగ్స్ తీసుకొస్తున్నారని గుర్తించారు. ప్రేమ్ ఉపాధ్యాయ్ అనే వినియోగదారుడిని అరెస్ట్ చేయడంతో ఈ ముఠా గుట్టురట్టయిందని, నిందితుల నుంచి రూ.69లక్షల విలువైన డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. కాటేదాన్‌లో డ్రగ్స్ దందా చేస్తున్న రాజస్థాన్‌కు చెందిన పవన్ భాటీని కూడా అరెస్ట్ చేశామని, హేమ్‌సింగ్ అనే మరో వ్యక్తితో కలిసి పవన్ భాటీ డ్రగ్స్ విక్రయిస్తున్నాడని, నిందితులు ముందు జాగ్రత్తగా రివాల్వర్, బుల్లెట్లు కూడా కొనుగోలు చేశారని సీవీ ఆనంద్ వెల్లడించారు.

# కొత్త పరిశ్రమలు రావాలి

# యువతకు ఉపాధి దక్కాలి

## ఇదే మా ప్రభుత్వ సంకల్పం, ఆ దిశగా చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం

### పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటాం

### పారిశ్రామికాభివృద్ధిలో పరిశ్రమలను భాగస్వామ్యం చేస్తాం

### పారిశ్రామిక సంఘాల ప్రతినిధుల భేటీలో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్, మహా :** తెలంగాణకు కొత్త పరిశ్రమలు రావాలి. ఇక్కడి యువతకు ఉపాధి దక్కాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సంకల్పమని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం సచివాలయంలో సీఐఐ, ఫిక్కీ, ఎఫ్‌టీసీసీఐ, ఎలీప్, టిఫ్, టాప్మా, టీఎస్‌టీఎంఏ తదితర పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. 'తెలంగాణ పురోగతిలో భాగస్వామ్యమవుతున్న పారిశ్రామికవేత్తలకు అన్ని రకాలుగా అండగా ఉంటాం. చట్టాలు, నిబంధనల పేరిట వారిని ఇబ్బంది పెట్టాలనే ఉద్దేశం మాకు లేదు. రాష్ట్రంలోని ప్రతి పరిశ్రమను కాపాడుకుంటాం. ముఖ్యంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న ఎంఎస్‌ఎంఈ రంగానికి అండగా ఉంటాం. అలాగే... కార్మికుల ప్రయోజనాలను కాపాడుతాం' అని వివరించారు. 'గత ప్రభుత్వం మాదిరిగా ఏకపక్షంగా వ్యవహరించం. మాది అందర్నీ కలుపుకుని పోయే ప్రభుత్వం. రాష్ట్రాభివృద్ధి కోసం అందరి సలహాలు, సూచనలు స్వీకరిస్తాం. వాటిని ఆచరణలో పెడతాం. పారిశ్రామికాభివృద్ధికి మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఈ ప్రయాణంలో పరిశ్రమలను భాగస్వామ్యం చేయాలని నిర్ణయించాం. అందుకే... పలు పారిశ్రామిక సంఘాల ప్రతినిధులతో సమావేశమై రాబోయే రోజుల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై మేధో మథనం చేశాం' అని పేర్కొన్నారు. 'పారిశ్రామికాభివృద్ధిలో తెలంగాణ ఇతర రాష్ట్రాలకు రోల్ మోడల్ గా మారింది. ఏడాదిన్నర వ్యవధిలో సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రానికి కొత్తగా రూ.3 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులను తీసుకొచ్చాం. ప్రైవేట్ రంగంలో లక్ష మందికి పైగా ఉపాధి కల్పించాం. అయినా... రాష్ట్రం నుంచి పరిశ్రమలు తరలి వెళ్లిపోతున్నాయంటూ బీఆర్ఎస్, బీజేపీ మాపై దుష్ప్రచారం చేస్తుంది' అని కొత్తగా రాష్ట్రానికొచ్చిన పెట్టుబడుల గురించి సమావేశంలో పాల్గొన్న ప్రతినిధులకు వివరించారు. రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధికి తీసుకుంటున్న చర్యలపై అవగాహన కల్పించారు. సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. పరిశ్రమలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీటిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశంలో తెలంగాణ మినమం వేజెస్ అడ్వైజరీ బోర్డ్ ఛైర్మన్ బి. జనక్ ప్రసాద్, ఐటీ, పరిశ్రమల శాఖ స్పెషల్ సీఎస్ సంజయ్ కుమార్, కార్మిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి, పారిశ్రామిక సంఘాల ప్రతినిధులు సమీవుద్దీన్, రాజీవ్ వెంకటరమణ, రాంచంద్రారావు, శేఖర్ రెడ్డి, జయదేవ్, రాజీవ్, సుజాత, రమాదేవి, సుధీర్ రెడ్డి, సునీల్, గౌతమ్, అరుణ్, నరేందర్ పాల్గొన్నారు.

**స్థానికత వివాదానికి పరిష్కారం వెతకాలి**

**నీట్‌లో స్థానిక కోటాపై తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు**

**హైదరాబాద్, మహా :** తెలంగాణ స్థానికత వివాదానికి పరిష్కారం వెతకాలని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేయొద్దని తెలంగాణ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. తదుపరి విచారణను ఆగస్టు 5వ తేదీకి వాయిదా వేసింది. నీట్ పరీక్ష రాయడానికి ముందు వరుసగా నాలుగేళ్లు తెలంగాణలో చదివితేనే స్థానికత వర్తిస్తుందని కాంగ్రెస్ ప్రభుత్వం నిబంధనలు విధించింది. ఈ నిబంధనలు చెల్లవంటూ తెలంగాణ హైకోర్టు గతేడాది తీర్పు వెల్లడించింది. హైకోర్టు తీర్పును తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. గత ఏడాది మాత్రం పిటీషనర్లకు మినహాయింపు ఇచ్చింది రేవంత్ రెడ్డి సర్కార్. ఈ ఏడాది తమకు కూడా స్థానికత నిబంధనల నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ సుప్రీంకోర్టులో విద్యార్థులు కొంత మంది పిటిషన్లు దాఖలు చేశారు. తెలంగాణలో పుట్టి పదో తరగతి వరకు చదివినా స్థానిక కోటా దక్కడం లేదని పిటీషన్‌లో పేర్కొన్నారు విద్యార్థులు. 11, 12వ తరగతులు చదవని కారణంగా నీట్‌లో స్థానిక కోటా దక్కక నష్టపోతున్నామని తెలంగాణ విద్యార్థులు సుప్రీంకోర్టుకి వివరించారు. ఈ మేరకు సమస్యకు పరిష్కారం చూపాలని, విద్యార్థులను ఇబ్బందులు పెట్టొద్దంటూ తెలంగాణ ప్రభుత్వానికి ఉన్నత న్యాయస్థానం సూచిస్తూ విచారణ వాయిదా వేసింది.

### ఆర్నెళ్లలో రోడ్డు ప్రమాదంలో

# 27 వేల మంది మృతి

## ఈ ఏడాది జనవరి- జూన్ మధ్యకాలంలో మరణాలు


### వెల్లడించిన కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ

### రాజ్యసభలో అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం

**ఢిల్లీ, మహా:** దేశవ్యాప్తంగా గత ఆర్నెళ్లలో పలు హైవేలపై జరిగిన ప్రమాదాల్లో దాదాపు 27 వేల మంది ప్రాణాలు కోల్పోయినట్లు కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడించారు. ఈ ఏడాది జనవరి జూన్ మధ్యకాలంలో ఈ మరణాలు నమోదైనట్లు పేర్కొన్నారు. రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో ఆయన ఈ వివరాలను పేర్కొన్నారు. హైవేలపై జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 26,770 మంది మృతి చెందారన్నారు. గతేడాది జరిగిన రోడ్డు ప్రమాదాల్లో దేశ వ్యాప్తంగా 52,609మంది ప్రాణాలు కోల్పోయినట్లు తన సమాధానంలో పేర్కొన్నారు.

**ప్రమాదాల నియంత్రణకు వ్యవస్థలు..**

ఢిల్లీ మేరఠ్ ఎక్స్‌ప్రెస్‌వే, ట్రాన్స్‌హరియాణా, ఢిల్లీ ముంబై ఎక్స్‌ప్రెస్‌వే వంటి అధిక ట్రాఫిక్ రద్దీ ఉన్న పలు జాతీయ రహదారులు, జాతీయ ఎక్స్‌ప్రెస్‌వేలలో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లను ఏర్పాటు చేసిందన్నారు. ఈ ఏటీఎంఎస్‌ల ద్వారా హైవేలపై ట్రాఫిక్‌ను



సమర్థంగా నిర్వహించడంతో పాటు భద్రతను పెంచి ప్రమాదాల నియంత్రణకు ఈ వ్యవస్థలు ఉపయోగపడుతున్నాయి. ఎన్‌హెచ్ఏఐ ఇప్పటికే వాహనాల రద్దీ, హైస్పీడ్ కారిడార్‌లపై కొత్త ప్రాజెక్టుల్లో ఏటీఎంఎస్‌ల ఏర్పాటును సాధారణ ప్రాజెక్టులో భాగంగానే ఉంటుందన్నారు. గత మూడేళ్లలో 1,12,561 కి.మీల జాతీయ రహదారులకు రోడ్డు భద్రతా ఆడిట్ నిర్వహించామని మరో ప్రశ్నకు సమాధానంగా తెలిపారు.

# వరంగల్‌లో జోరుగా గంజాయి దందా

## దంపతుల అరెస్ట్, 18 కేజీల గంజాయి స్వాధీనం

**వరంగల్ మహా;** రైల్వే స్టేషన్ పరిధిలో భారీగా గంజాయి రవాణాకు ప్రయత్నిస్తున్న ఒడిశా దంపతులను ఇంతె జార్‌గంజ్ పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి దాదాపు 18 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. దీని అంతర్జాతీయ మార్కెట్ విలువ సుమారు రూ 9 లక్షల వరకు ఉంటుందని పోలీసులు అంచనా వేస్తున్నారు. బుధవారం ఉదయం ఇంతజార్‌గంజ్ పోలీసులు వరంగల్ రైల్వే స్టేషన్ సమీపంలోని రవి టిఫిన్ సెంటర్ వద్ద పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు. నలుగు పెద్ద బ్యాగులతో అనుమానాస్పదంగా కనిపించిన ఒక మగ, ఒక ఆడ వ్యక్తిని గుర్తించారు. పోలీసులు వారిని తనిఖీ చేయడానికి ప్రయత్నించగా, వారు భయంతో పారిపోవడానికి ప్రయత్నించారు. అప్రమత్తమైన పోలీసులు చాకచక్యంగా వారిని పట్టుకున్నారు. విచారణలో, నిందితులు ఒడిశాలోని గజపతి జిల్లా, కట్టంగుమా గ్రామానికి చెందిన భార్యాభర్తలైన జులియం బెహరా (60), జులియం కుమారి బెహరా (55) అని తేలింది. వీరు హిందీ, ఒడియా భాషలు మాట్లాడుతున్నారు. వారి బ్యాగులను తనిఖీ చేయగా, అందులో పంజరులతో నిండిన 18 కిలోల ఎండు గంజాయి బయటపడింది. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని, అయితే సరైన ఆదాయం లేకపోవడంతో సులువుగా డబ్బు సంపాదించేందుకు గంజాయి వ్యాపారం ఎంచుకున్నామని నిందితులు పోలీసులకు తెలిపారు. ఒడిశాలోని తమ గ్రామం వద్ద గుర్తుతెలియని వ్యక్తి వద్ద ఈ గంజాయిని కొనుగోలు చేసి, సోలాపూర్‌లో కిలో ₹50,000 చొప్పున విక్రయించేందుకు తరలిస్తున్నట్లు వెల్లడించారు. వీరు సోలాపూర్‌కు వెళ్లేందుకు టికెట్ లేకుండా జనరల్ బోగీలో రైలులో ప్రయాణిస్తుండగా, వరంగల్ రైల్వే స్టేషన్‌లో టీటీ (ట్రావెలింగ్ టికెట్ ఎగ్జామినర్) తనిఖీకి వస్తున్నాడని భయపడి రైలు దిగిపోయినట్లు చెప్పారు.

# మింత్రాపై ఈడీ కేసు నమోదు

### ఎఫ్‌డీఐ నిబంధనలు ఉల్లంఘించి రూ. 1,654 కోట్ల అవకతవకలకు పాల్పడినట్లు గుర్తింపు

### హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ ముసుగులో రిటైల్ ట్రేడ్‌ను నిర్వహిస్తున్న మింత్రా

### ఫెమా నిబంధనలు ఉల్లంఘిస్తోందంటూ ఈడీ కేసు నమోదు

**ఇంటర్నెట్ డెస్క్, మహా :** ఆన్‌లైన్ దిగ్గజం ఫ్లిప్‌కార్ట్‌కు చెందిన ఈకామర్స్ వేదిక 'మింత్రా'పై ఈడీ కేసు నమోదు చేసింది. ఎఫ్‌డీఐ నిబంధనలు ఉల్లంఘించి రూ. 1,654 కోట్ల మేర అవకతవకలకు పాల్పడినట్లు గుర్తించి ఫారిన్ ఎక్స్ఛేంజీ మేనేజ్‌మెంట్ యాక్ట్ (ఫెమా) కింద కేసు నమోదు చేసింది. మింత్రాతో పాటు, అనుబంధ సంస్థలు, డైరెక్టర్లపై అభియోగాలు మోపింది. హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ ముసుగులో మింత్రా, దాని అనుబంధ సంస్థ మల్టీ బ్రాండ్ రిటైల్ ట్రేడ్‌ను నిర్వహిస్తున్నాయని, ఇది ఎఫ్‌డీఐ నిబంధనలకు విరుద్ధమని ఈడీ పేర్కొంది. మింత్రా తాము హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ వ్యాపారంలో నిమగ్నమై ఉన్నామని చెబుతూ విదేశీ పెట్టుబడిదారుల నుంచి వేల కోట్ల రూపాయలు స్వీకరించింది. తమ ఉత్పత్తులను ఎక్కువగా వెక్టర్ ఈకామర్స్ ప్రైవేటు లిమిటెడ్ అనే సంస్థకు విక్రయించింది. ఆ సంస్థ ఆ ఉత్పత్తులను రిటైల్ కస్టమర్లకు అమ్మింది. వాస్తవానికి మింత్రా, వెక్టర్ ఈకామర్స్ ఒకే గ్రూపునకు చెందిన కంపెనీలుగా ఈడీ గుర్తించింది.

మింత్రా హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ వ్యాపారం చేస్తున్నామని చెప్పినప్పటికీ వాస్తవానికి మల్టీ బ్రాండ్ రిటైల్ ట్రేడింగ్ నిర్వహిస్తున్నట్లు ఈడీ గుర్తించింది. హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ అంటే ఉత్పత్తులను రిటైలర్లకు లేదా హోల్‌సేల్ దుకాణాలకు విక్రయించవచ్చు. కానీ వినియోగదారులకు నేరుగా అమ్మకాలు జరపరాదు. మింత్రా తమ ఉత్పత్తులను వెక్టర్ ఈకామర్స్ కు విక్రయించి ఆ సంస్థ ద్వారా రిటైల్ కస్టమర్లకు చేరేలా చూస్తోంది. అంతేకాకుండా, హోల్‌సేల్ క్యాష్ అండ్ క్యారీ సంస్థలు తమ గ్రూప్ కంపెనీలకు కేవలం 25 శాతం విక్రయాలు మాత్రమే జరపాలి. కానీ మింత్రా వెక్టర్ ఈకామర్స్‌కు వంద శాతం ఉత్పత్తులను విక్రయిస్తోంది. ఒకే గ్రూపునకు చెందిన సంస్థకు ఇలా పూర్తి విక్రయాలు జరపడం ఫెమా నిబంధనలు ఉల్లంఘించడమేనని ఈడీ కేసు నమోదు చేసింది.

# మంత్రి పదవి కంటే నాకు మునుగోడు ప్రజలే ముఖ్యం


## కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి

### 2023లో ఎల్బీ నగర్ నుంచి పోటీ చేయమన్నారు

### గెలిస్తే మంత్రి పదవి ఆఫర్ చేసినా వద్దన్నా

**నల్గొండ, మహా :** కొద్దికాలంగా నిత్యం వార్తల్లో నిలుస్తున్న కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి మరోసారి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు మంత్రి పదవి కంటే మునుగోడు ప్రజలే ముఖ్యమని, ఎల్బీ నగర్ నుంచి పోటీ చేస్తే మంత్రి పదవి ఇస్తామని అధిష్టానం నుంచి ఆఫర్ ఆఫర్ వచ్చినా తిరస్కరించినట్లు చెప్పారు. మునుగోడు మండలంలో లబ్ధిదారులకు బుధవారం రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజగోపాల్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో తనను ఎల్బీ నగర్ నుంచి పోటీ చేయాలని అధిష్టానం సూచించినా, తాను మునుగోడు నుంచే బరిలోకి దిగానని చెప్పారు. నల్గొండ జిల్లా నుంచి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట రెడ్డి ఉన్నారని, ఎల్బీ నగర్ నుంచి పోటీ చేస్తే తనకు మంత్రి పదవి ఇస్తారని ఆ నాడు కాంగ్రెస్ పెద్దలు చెప్పారని రాజగోపాల్ రెడ్డి గుర్తు చేశారు.

2018 అసెంబ్లీ ఎన్నికల్లో నల్గొండ జిల్లా నుంచి అందరూ ఓడిపోతే, కాంగ్రెస్ పార్టీ నుంచి తానొక్కడినే గెలిచానని రాజగోపాల్ రెడ్డి ప్రజలకు గుర్తు చేశారు. మునుగోడు ఉప ఎన్నికల్లో కూడా నైతిక విజయం తనదేనని, అందుకే మంత్రి పదవి కంటే తనకు మునుగోడు ప్రజలే ముఖ్యమని చెప్పారు. ఎప్పుడైనా మునుగోడు నుంచే పోటీ చేస్తానంటూ ఆయన స్పష్టం చేశారు. మునుగోడులో ఉన్న ప్రతి ఒక్కరికీ ఇళ్లు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో గెలిచిన రాజగోపాల్ రెడ్డి, అనంతరం బీజేపీలో చేరారు. అయితే బీజేపీలో తగిన ప్రాధాన్యత దక్కకపోవడంతో తిరిగి సొంత గూటికే చేరుకున్నారు. ఇటీవల తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి తప్పుబట్టారు. 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానంటూ రేవంత్ ప్రకటించారు. దాంతో రాజగోపాల్ రెడ్డి కౌంటర్ అటాక్ ఇస్తూ రేవంత్ ప్రకటన కాంగ్రెస్ విధానాలకు వ్యతిరేకమంటూ ట్వీట్ చేశారు. జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్‌లో అధిష్టానం ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి ఎన్నిక ఉంటుందని చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్‌ను వ్యక్తిగత సామ్రాజ్యంగా మార్చుకునే ప్రయత్నాలను నిఖార్సయిన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సహించరు అంటూ ఘాటుగానే ట్వీట్ చేశారు.



# నరికిన చెట్ల స్థానంలో మొక్కలు పెంచాలి


- పర్యావరణ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాల్సిందే
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అధికారులను జైలుకు పంపిస్తాం
- కంచె గచ్చిబౌలిపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు
- విచారణ ఆగస్టు 13 కు వాయిదా

**న్యూఢిల్లీ, మహా :** కంచగచ్చిబౌలిలో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు బుధవారం మరోసారి సంచలన వ్యాఖ్యలు చేసింది. నరికిన చెట్ల స్థానంలో మొక్కలు నాటి పర్యావరణాన్ని పునరుద్ధరించాలని అధికారులకు సూచించింది. లేదంటే అధికారులను జైలుకు పంపిస్తామని మరోమారు హెచ్చరించింది. హెచ్ సీయూ సమీపంలోని కంచగచ్చిబౌలి భూముల వివాదంపై సీజేఐ జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఈ భూమిలో పర్యావరణ పునరుద్ధరణకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం మంగళవారం దాఖలు చేసిన అఫిడవిట్ ను ధర్మాసనం పరిశీలించింది. గత విచారణలో ధర్మాసనం ఇచ్చిన ఆదేశాలకు అనుగుణంగా చర్యలు చేపట్టినట్లు తెలిపింది. కంచగచ్చిబౌలి భూముల్లో పనులు నిలిపివేసి పర్యావరణ పునరుద్ధరణకు కృషి చేస్తున్నట్లు అఫిడవిట్ లో పేర్కొంది. ప్రభుత్వం దాఖలు చేసిన అఫిడవిట్ ను పరిశీలించడానికి సమయం కావాలని అమికస్ క్యూరీ కోరడంతో సుప్రీం ధర్మాసనం విచారణను ఆగస్టు 13కు వాయిదా వేసింది. కంచగచ్చిబౌలిలోని 400 ఎకరాల భూమిలో చెట్ల నరికివేతపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. గత విచారణలో సీజేఐ నేతృత్వంలోని సుప్రీం ధర్మాసనం అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. చెట్ల నరికివేతను వెంటనే నిలిపివేసి, నరికిన చెట్ల స్థానంలో మొక్కల పెంపకం చేపట్టాలని ఆదేశించింది.




# దక్షిణాది సినీ అవార్డుల పండుగ..

దక్షిణాది సినీ అవార్డుల పండుగ సైమా(సౌత్ ఇండియన్ ఇంటర్నేషనల్ మూవీ అవార్డ్స్) ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరగనుంది. ఇప్పటికే వేదికతో పాటు తేదీలను నిర్వాహకులు ప్రకటించారు. తాజాగా ఈ అవార్డులకు ఎంపికైన నామినేషన్స్ జాబితాను వెల్లడించారు. బాక్సాఫీస్ వద్ద సూపర్‌హిట్‌గా నిలిచిన దక్షిణాది సినిమాలు ఈ అవార్డుల కోసం పోటీపడుతున్నాయి. తెలుగుతో పాటు తమిళ, మలయాళం, కన్నడ భాషల్లో ఎంపికైన చిత్రాల జాబితాను తాజాగా సైమా అవార్డుల కమిటీ ప్రకటించింది. తెలుగు సినిమాల విషయానికొస్తే అత్యధికంగా పుష్ప 2 చిత్రం నామినేషన్స్ దక్కించుకుంది. ఏకంగా 11 విభాగాల్లో ఎంపికైంది. ఆ తర్వాత ప్రభాస్ హీరోగా నటించిన కల్కి మూవీ పది నామినేషన్స్‌తో రెండో ప్లేస్‌లో నిలిచింది. అంతేకాకుండా తేజ సజ్జాప్రశాంత్ వర్మ చిత్రం హను మాన్ కూడా 10 విభాగాల్లో నామినేషన్స్ సొంతం చేసుకుంది. కాగా... గతేడాదిలో రిలీజైన ఈ సినిమాలు బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. ఇక కోలీవుడ్ విషయానికొస్తే శివ కార్తికేయన్ సాయిపల్లవి జంటగా వచ్చిన అమరన్ 13 నామినేషన్స్ దక్కించుకుంది. లబ్బర్ పందు 8, వాజై 7 విభాగాల్లో నిలిచాయి. ఇక శాండల్‌వుడ్‌లో భీమా, కృష్ణ ప్రణయ సఖి చిత్రాలు తొమ్మిది విభాగాల్లో నామినేషన్స్ సాధించాయి. ఇబ్బని తబ్బిడ ఇలియాలి 7 విభాగాల్లో నామినేషన్స్ దక్కించుకుంది. అలాగే మలయాళం పృథ్వీరాజ్ సుకుమారన్ హీరోగా వచ్చిన ది గోట్ లైఫ్(ఆడుజీవితం) అత్యధికంగా 10 విభాగాలకు ఎంపికైంది. ఆ తర్వాత ఏఆర్ఎమ్ 9, ఆవేశం 8 నామినేషన్స్ దక్కించుకున్నాయి. ఈ 13వ సైమా అవార్డుల వేడుక దుబాయ్ వేదికగా సెప్టెంబర్ 5,6 తేదీల్లో జరగనుంది.



## మిస్ శ్లోక

పవన్ కల్యాణ్ హీరోగా హరీష్ శంకర్ దర్శకత్వంలో రూపొందుతున్న తాజా సినిమా 'ఉస్తాద్ భగత్‌సింగ్'. ఈ చిత్రంలో పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తున్నారు పవన్ కల్యాణ్. ఈ మూవీలో శ్రీలీల హీరోయిన్ గా నటిస్తున్నారు. కాగా ఈ సినిమాలోని మరో హీరోయిన్ పాత్రకు రాశీఖన్నాను ఎంపిక చేసింది యూనిట్. 'ఉస్తాద్ భగత్‌సింగ్' లో శ్లోక పాత్రలో రాశీఖన్నా నటిస్తున్నట్లు వెల్లడించి, ఆమె ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవి శంకర్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. అశుతోష్ రానా, నవాబ్ షా, 'కేజీఎఫ్' ఫేమ్ అవినాష్, గౌతమి, నాగ మహేశ్, టెంపర్ వంశీ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.




## విడాకుల బాటలో హన్సిక..

అందానికి మారు పేరు హన్సిక. ఈ ముంబై బ్యూటీ హిందీ, తెలుగు, తమిళం పలు భాషల్లో కథానాయకిగా నటించి పైస్థాయికి చేరుకుంది. అలా అర్ధ సెంచరీకి పైగా చిత్రాలు చేసిన హన్సిక ముఖ్యంగా తమిళంలో ధనుష్, విజయ్, సూర్య, శివకార్తికేయన్, సిద్ధార్థ్ వంటి ప్రముఖ హీరోల సరసన నటించి పాపులర్ అయ్యారు. కాగా కథానాయకిగా బిజీగా ఉన్న సమయంలోనే 2022లో సోహల్ కత్తూరియా అనే వ్యాపార వేత్తని పెళ్లి చేసుకున్నారు. వీరి పెళ్లి ఆడంబరంగా జరిగింది. కాగా సోహల్‌కు ఇది రెండో పెళ్లి. హన్సిక స్నేహితురాలితో ఆయనకు ఇంతకుముందే పెళ్లై విడాకులు తీసుకున్న వ్యక్తి కావడం గమనార్హం. కాగా పెళ్లయిన రెండేళ్లకే హన్సికకు, భర్తకు మధ్య మనస్పర్థలు తలెత్తాయని, దీంతో ఇద్దరు విడిపోయినట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రసారం వైరల్ అవుతోంది. సోహల్‌ది పెద్ద కుటుంబం అని, వారితో హన్సిక కలవలేకపోవడం వల్లే మనస్పర్థలు వచ్చాయని, దీంతో ఆమె తన తల్లి వద్దనే ఉంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈవ్యవహారంపై ముంబైలోని మీడియా హన్సిక వర్గాన్ని సంప్రదించగా వారు అవునని కానీ కాదని కానీ స్పందించలేదని సమాచారం. అయితే సోహెల్ మాత్రం స్పందిస్తూ ప్రస్తుతం జరుగుతున్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని పేర్కొన్నారు. అయితే ఆయన హన్సిక కలిసి ఉంటున్నారా లేదా అన్న విషయంపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. ఏదేమైనా పెళ్లికి ముందు నటించడానికి అంగీకరించిన కొన్ని చిత్రాలను పూర్తి చేయడానికి హన్సిక సిద్ధమవుతున్నట్లు తాజా సమాచారం. ప్రస్తుతం ఆమె టీవీ కార్యక్రమాల్లో న్యాయనిర్ణేతగా, పాల్గొంటూ, వాణిజ్య ప్రకటనలు చేస్తూ బిజీగానే ఉన్నారు.



## సినీ నటుడు రానాకు ఈడీ మళ్లీ సమన్లు

ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన కేసులో రానాకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) మరోసారి సమన్లు జారీ చేసింది. ఆగస్ట్ 11న విచారణకు హాజరు కావాలని మసన్లలో పేర్కొంది. వాస్తవానికి నేడు(జులై 23) రానా ఈడీ విచారణకు హాజరు కావాల్సింది. కానీ ఆయన గడువు పొడిగించాలని ఈడీకి విజ్ఞప్తి చేశాడు. దీంతో తాజాగా మరో తేదిని ఖరారు చేస్తూ సమన్లు జారీ చేసింది. ఆగస్ట్ 11న కచ్చితంగా హాజరు కావాలంటూ సమన్లలో పేర్కొంది. సైబరాబాద్, సూర్యాపేట, పంజగుట్ట, మియాపూర్, విశాఖపట్నంలో లోన్ యాప్‌లపై నమోదైన వేర్వేరు ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ఈడీ ఎన్‌ఫోర్స్‌మెంట్ కేస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్ (ఈసీఐఆర్) రిజిస్టర్ చేసిన విషయం తెలిసిందే. లోన్ యాప్‌లకు ప్రచారకర్తలుగా వ్యవహరించిన నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సహా మొత్తం 29 మందిని ఈసీఐఆర్‌లో చేర్చింది.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com